నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 13 జనవరి 2025 | SIDDIPET

ప్రశ్నిస్తే దాడులా..?

- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 12: ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా.. అని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో మండిపడ్డారు. భువనగిరిలో బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఆమె ఖండించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ సర్కారేనని, పదేండ్లలో బీఆర్ఎస్ ఇలాంటి అరాచకాలు చేయలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

సిద్దిపేటలో వివేకానంద జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 12: స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం సిద్దిపేటలోని విక్టరీ టాకీస్ చౌరస్తా వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి, జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశ యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపడంతో పాటు వారికి కర్తవ్యాన్ని స్వామి వివేకానంద బోధించారన్నారు. హిందూ మత ఔన్నత్యాన్ని, దేశ సాంస్కృతిక, చారిత్రక వారసత్వ వైభవాన్ని ప్రపంచ సర్వమత మహాసభలో ఘనంగా చాటి చెప్పారన్నారు. తన ప్రసంగాలతో భారత జాతిని మేల్కొల్పారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరామ్, కౌన్సిలర్లు సాయిశ్వర్ గౌడ్, సాయన్న గారి సుందర్, కో ఆప్షన్ సభ్యుడు మేర సత్తయ్య, కాటం రఘురామ్, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రజినీకాంత్‌రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కార్మిక విభాగం నాయకుడు శ్రీనివాస్, నాయకులు జువ్వన్న కనకరాజు, లిఖిత్, రమేశ్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కలేనా..

- బీఆర్ఎస్ హయాంలో రూ.6 కోట్ల పనులకు శ్రీకారం
- ఏడాదిగా నీలినీడలు.. ఎప్పుడు పూర్తయ్యేనో..?
- రోడ్లపైనే విక్రయాలు.. ట్రాఫిక్‌తో ఇక్కట్లు
- కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవాలని ప్రజల విజ్ఞప్తి

నర్సాపూర్‌లో అసంపూర్తిగా పనులు

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో అసంపూర్తిగా ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు

నర్సాపూర్, జనవరి 12: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం కలగానే మిగిలిపోనున్నాదా... పట్టణ, గ్రామీణ వాసుల ఇక్కట్లు తీరడానికి పరిష్కారమే లేదా... మధ్యలోనే నిలిపివేసిన భవనాన్ని చూస్తుంటే నిజమేనేమో అనిపిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సాపూర్ మున్సిపల్ వాసులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో నర్సాపూర్‌లోని పాత తహసీల్ కార్యాలయ స్థలంలో 1.20 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనికి రూ. 2 కోట్లు మంజూరు చేసింది. జీ ప్లస్ వన్‌కు అదనంగా రూ. 4 కోట్లు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎకరాన్నర విస్తీర్ణంలో 62 స్టాళ్లతో నిర్మాణ పనులు చేపట్టాలని ప్రణాళికతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్లాబ్ దశలోనే పనులు ఆగిపోయి పట్టణవాసుల ఆశలు అడియాశలుగా మిగిలిపోయాయి. నర్సాపూర్ పట్టణంలో కూరగాయలు, ఇతర సామగ్రి కొనడానికి పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. శుక్రవారం సంత కావడంతో ఇసుక వేస్తే రాలనంత జనంతో పట్టణం కిక్కిరిసిపోతున్నది. కూరగాయలు, చికెన్, మటన్, చేపలు కొనుక్కోవడానికి ఇటు ప్రజలు, అటు అమ్ముకోడానికి వ్యాపారులు నానా ఇక్కట్లు పడుతున్నారని, ఈ సమస్యలు పరిష్కరించడానికి నర్సాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ సహకారంతో అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదట్లో గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే నిర్మించాలని నిర్ణయించిన తర్వాత మరో రూ.4 కోట్లు అదనంగా మంజూరు చేసి జీ-ప్లస్ వన్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా చురుకుగా సాగిన పనులు ప్రభుత్వం మారడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు పూర్తయితే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

సమస్యలకు నిలయంగా నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లేకపోవడంతో ఎన్నో రకాల సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లేకపోవడంతో కూరగాయలు, పండ్లు, పూలు తదితర వ్యాపారులు రోడ్ల పక్కన, వీధుల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. అడుగు తీసి అడుగు ముందుకు వేయలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఉండడంతో ప్రజలు వాహనాలను రోడ్లపైనే నిలిపి కూరగాయలను, పండ్లను, పూలను కొనుగోలు చేయడంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎస్‌బీఐ శాఖ నుంచి పోస్టాఫీస్ వరకు మంగళ, శుక్రవారాల్లో మార్కెట్ నిర్వహించుకోవడానికి మున్సిపల్ అధికారులు నూతనంగా అనుమతులు ఇచ్చారు. అదే మార్గంలో పోలీస్ స్టేషన్, బ్యాంకులు, పోస్టాఫీస్, మున్సిపల్, తదితర కార్యాలయాలు ఉండడంతో ప్రజలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మటన్, చికెన్, చేపలు ఒక్కచోట విక్రయించకపోవడంతో ప్రజలు చాలా దూరం నడవాల్సి వస్తున్నది. ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తిచేస్తే ఈ దుకాణాలన్ని ఒకే చోటికి రావడంతో ప్రజలకు ఎంతగానో సౌకర్యంగా మారుతుంది. ట్రాఫిక్ సమస్య నుంచి వాహనదారులకు ఉపశమనం లభిస్తుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు, వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

నర్సాపూర్‌లోని ఓ వీధిలో విక్రయిస్తున్న కూరగాయలు

నర్సాపూర్‌లో జాతీయ రహదారి పక్కన వెలిసిన పూలు, పండ్ల దుకాణాలు

మన సంస్కృతిని పిల్లలకు తెలియజేయాలి

సిద్దిపేట్టలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న హరీశ్‌రావు

- సిద్దిపేటను అన్నింటా ఆదర్శంగా నిలిపా
- రైతులు, వైద్యులు, పోలీసులను ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి
- కాంగ్రెస్ మోసాలను ముగ్గుల్లో చూపించిన మహిళల తీరు అభినందనీయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో ముగ్గుల పోటీలకు హాజరు

ముగ్గులను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 12: మన సంస్కృతీ సంప్రాయాలను పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలని,మన పండుగల గొప్పతనాన్ని వారికి వివరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని 4వ వార్డులో కౌన్సిలర్ కొండం కవితాసంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో, 9వ వార్డులో కౌన్సిలర్ సతీశ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆయన హాజరై అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను, గురువులను, పుట్టిన ఊరును మర్చిపోవద్దన్నారు. బతుకమ్మ, బోనాలు తెలంగాణకు గర్వకారణం అన్నారు. అన్నం పెట్టే రైతు, పోలీసులు, వైద్యులకు మనం ఎల్లప్పుడు కృతజ్ఞతగా ఉండాలన్నారు. వీరి గురించి తెలిసేలా మహిళలు ముగ్గులు వేయడంపై హరీశ్‌రావు అభినందించారు. ఆరు గ్యారెంటీలు, పథకాలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిన తీరును మహిళల ముగ్గుల రూపంలో తెలియజేయడం భేష్ అన్నారు. సీఎం రేవంత్ మహిళలనే కాకుండా అన్ని వర్గాలను మోసం చేశాడని ఆరోపించారు. మీ అందరి ఆశీర్వాదంతో సిద్దిపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించుకుని మురుగు వాసన లేకుండా చేసుకున్నామన్నారు. ఒకప్పుడు సిద్దిపేట అంటే పందులు, మోరీల వాసన ఉండేదని, నేడు సిద్దిపేట అంటే పచ్చదనం, పరిశుభ్రతకు చిరునామాగా నిలిపినట్లు గుర్తుచేశారు. మంచినీళ్లకు గోస లేకుండా చేసుకున్నామన్నారు. అన్నిరంగాల్లో సిద్దిపేటను అగ్రగామిగా నిలిపానని, రానున్న రోజుల్లోనూ ఇది కొనసాగుతుందన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు హరీశ్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి భూపేశ్, మేర సత్తయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

- చిన్నకోడూరు మండల యువజన, విద్యార్థి నాయకుల సమావేశంలో హరీశ్‌రావు

చిన్నకోడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సమావేశంలో పాల్గొన్న యువజన విభాగం నాయకులు

సిద్దిపేట, జనవరి 12: కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్న తీరును ప్రజలకు తెలియజేయాలని, కాంగ్రెస్ దుర్మార్గ పాలనను ఎండగట్టాలని పార్టీ క్యాడర్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో చిన్నకోడూరు మండలం యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కారు అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను బంద్ పెట్టిందన్నారు. పదేండ్ల పాటు సిద్దిపేటలో అభివృద్ధి పరుగులు పెట్టగా, ఏడాదిలో కాంగ్రెస్ ఆగంజేసిందన్నారు. సిద్దిపేట కాంగ్రెస్ నాయకలకు ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలు పట్టవా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రద్దు చేసిన పనులపై మీ వైఖరి ఏంటో చెప్పాలన్నారు. చిన్నకోడూరు రోడ్డు పనులు, నర్సింగ్ కళాశాల పనులు ఆగిపోయాన్నారు. చాలా పనులకు నిధులు రాక పూర్తికావడం లేదని, సిద్దిపేట ప్రజల కోసం అభివృద్ధి పనులు జరిగే వరకు పోరాటం చేస్తానని హరీశ్‌రావు తెలిపారు. చిన్నకోడూరు మండలంలో పదేండ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌కు యువత దూరంగా ఉండాలని, భవిష్యత్ అంతా యువతదే అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువు, క్రీడలు రెండింట్లోనూ రాణించాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డిలో క్రికెట్ ఆడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి, జనవరి 12: గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి క్రీడల్లో రాణించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మిరుదొడ్డిలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌కు ఆదివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపర్చారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గెలుపోటములకు కుంగిపోవద్దన్నారు. నేడు అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న క్రీడాకారుల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారేనని తెలిపారు. విద్యార్థులు, యువత సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. క్రీడలతో పాటు బాగా చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, మాజీ కో-ఆప్టెడ్ సభ్యుడు ఎండీ అహ్మద్, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు సూకురి లింగం, నాయకులు ఐలయ్య, సాయి కుమార్, శేఖర్, కుమార్, రాధాకృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో గంగిరెద్దులను ఆటాడిస్తున్న దృశ్యం

సిద్దిపేటలో నోము సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు

సంక్రాంతి శోభ

ముస్తాబవుతున్న లోగిళ్లు

పల్లెకు సంక్రాంతి శోభ వచ్చింది. ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా పండుగకు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. దీంతో గ్రామసీమలు కళకళలాడుతున్నాయి. ప్రతి ఇంటా సందడి వాతావరణం నెలకొంది. సకినాలు, మురుకులు, చెగోడీలు, అరిసెలు తదితర పిండివంటలు తయారీలో మహిళలు బిజీగా మారారు. పిండివంటలు ఘుమఘుమలకే కడుపు నిండిపోతున్నది. వచ్చిపోయేవారితో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ముగ్గులు, నోములు, ఇతర పండుగల సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడు తున్నాయి. పతంగులు, మాంజాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పతంగులు ఎగరవేస్తూ యువత, చిన్నారులు సందడి చేస్తున్నారు. గంగిరెద్దుల వాళ్లు ఇంటింటినీ తట్టి భిక్షం స్వీకరిస్తున్నారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, జనవరి 12

సిద్దిపేటలో పిడకలు, బొబ్బెమ్మల విక్రయాలు

సిద్దిపేటలో ముగ్గులకు రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సిద్దిపేటలో పతంగులు కొనుగోలు చేస్తున్న యువత

సిద్దిపేటలో పిండివంటలు చేస్తున్న మహిళలు

స్పెషల్ పేరిట బాదుడు

- జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.240
- ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్న ఆర్టీసీ

పండుగ వేళ భారీగా టికెట్ చార్జీలు వసూలు

జేబీఎస్ నుంచి మెదక్‌కు ఇద్దరికి ఇచ్చిన టికెట్

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులపైన స్పెషల్ పేరిట ఆర్థిక భారం మోపుతున్నది రాష్ట్ర రవాణా సంస్థ ఆర్టీసీ. పండుగ కోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నది. స్పెషల్ బస్సుల పేరిట బోర్డులు తగిలించి ముక్కుపిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తున్నదని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్పెషల్ పేరిట ఛార్జీల మోత...

మెదక్ జిల్లాలోని డిపోల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులకు సంక్రాంతి స్పెషల్ పేరిట బోర్డులు తగిలించి ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నుంచి నడిపిస్తున్న కొన్ని బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. జేబీఎస్ నుంచి మెదక్‌కు స్పెషల్ బస్సులు నడుపుతూ ప్రయాణికుల వద్ద అధికంగా వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో జనం పల్లెలకు వస్తుంటారు. ఇదే అదనుగా భావించిన ఆర్టీసీ అధికారులు రెగ్యులర్‌గా నడిపించే బస్సులకే దర్జాగా సంక్రాంతి స్పెషల్ బోర్డులు తగిలించి అధిక చార్జీలు వసూలు చేసి ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నారు. ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. మెదక్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 35 జెడ్ 0022 నెంబర్ గల బస్సు ఉదయం 7:30కు మెదక్ డిపోకు చెందిన బస్సు జేబీఎస్‌కు చేరుకుంది. ఈ క్రమంలో జేబీఎస్‌లో ఆ బస్సు ఎక్కిన ప్రయాణికులతో డ్రైవర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.160 చార్జి కాగా, అదనంగా రూ.80 వసూలు చేసి రూ.240 టికెట్ ఇచ్చాడు. అక్కడే ఉన్న మెదక్ డిపో మేనేజర్‌ను ఇదేమిటని అడుగగా, సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిచ్చారు.

బస్సుల్లో రద్దీ.. ప్రయాణికుల పాట్లు

ఆదివారం జోగిపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

అందోల్, జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా పండుగకు స్వగ్రామాలకు పయనమవుతున్నారు. దీంతో రెండు రోజులుగా ఏ బస్సు చూసినా పరిమితికి మించి ప్రయాణికులతో కనిపిస్తున్నది. ఇదే అదునుగా ఆర్టీసీ అధికారులు స్పెషల్ సర్వీసుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నామని చెబుతున్నా, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మాత్రం బస్సులు ఉండడంలేదని అంటున్నారు. మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటున్నది, ఇప్పుడు పండుగ ఉండడంతో బస్సులో కాలు పెట్టేందుకు స్థలం ఉండడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. పండుగ కావడంతో సొంతూర్లకు వెళ్లక తప్పని పరిస్థితి. దీంతో పడుతూ... లేస్తూ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణాలు సాగిస్తున్నామంటున్నారు ప్రజలు. ఆర్టీసీ స్పెషల్ చార్జీలు వసూలు చేయడం సరికాదంటున్నారు. ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేయడం, మరికొన్ని బస్సులకు 'స్పెషల్' అంటూ బోర్డులు తగిలించి అధిక చార్జీలు వసూలు చేస్తుండడంతో కండక్టర్లతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో కండక్టర్లు సైతం ప్రయాణికులకు సర్ధిచెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. పండుగల పేరుతో ఆర్టీసీ అదనపు చార్జీ వసూలు చేయడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులకు స్పెషల్ బోర్డులను తగిలించిన దృశ్యం